# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 326    సోమవారం | 15 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5






ఉత్సాహంగా..
శ్రీదీప్ ఆర్యన్
పుట్టిన రోజు వేడుక

8లో..



# పేరుకే స్మార్ట్..
# పనులన్నీ పెండింగ్



- నరకాన్ని తలపిస్తున్న నగర రోడ్లు
- అడుగుకో గుంత
- ఆదమరిస్తే అనంతలోకాలకే
- ఇబ్బందులు పడుతున్న జనం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పాలకులు

వివరాలు 2లో..

నగర రహదారులు నరకాన్ని తలపిస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా, ప్రజా ప్రతినిధులు మారుతున్నా రహదారుల స్థితిగతులు మాత్రం మారడంలేదు. నగరంలోని ఏ డివిజన్ చూసినా ఏ మున్నది గర్వకారణం అన్నట్లుగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని రహదారులు దర్శనమిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తొలి రోజుల్లో రాష్ట్రం రెండో రాజధానిగా గుర్తింపు పొందిన వరంగల్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని, అందుకు కావాల్సిన నిధులు సమకూరుస్తామంటూ ప్రకటనలు చేసిన నాయకుల హామీలు నీటి మూటలుగా మారాయి. దీంతో నగర వాసులకు ప్రయాణం ఒక నరకంగా మారింది. అడుగుకో గుంత అన్న చందంగా నగరంలోని రహదారులు దర్శనమిస్తున్నాయి. వరంగల్ నగరాన్ని స్మార్ట్ సిటీగా ఎంపిక చేసినా అధికారుల అవినీతి, అక్రమాలతో పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దర్శనమిస్తున్నాయి. గుంతలమయంగా మారిన రహదారులపై వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా బల్దియా పాలకవర్గం, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రేటర్ అధికారుల తీరును ప్రజలు బాహాటంగానే ఎండగడుతున్నారు.

**– వరంగల్ వాయిస్, వరంగల్**

## మొక్కతో మొక్కులు చెల్లిస్తాం..

వన మహోత్సవ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలి

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి : రాష్ట్ర మంత్రి సీతక్క



2లో..



2లో..

## మత్తు పదార్థాలు వద్దు..
## భవిష్యత్ ముద్దు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

విద్యార్థులకు అవగాహన సదస్సు




8లో

## అర్హులకే రైతు భరోసా

- వ్యవసాయాన్ని ఆదుకునేలా చర్యలు
- సన్న, చిన్నకారు రైతులకే చేయూత
- హామీ అమలుకే ప్రజాభిప్రాయ సేకరణ
- ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క

# పేరుకే స్మార్ట్

## పనులన్నీ పెండింగ్..





**నరకాన్ని తలపిస్తున్న నగర రోడ్లు**

**అడుగుకో గుంత**

**ఆదమరిస్తే అనంతలోకాలకే**

**ఇబ్బందులు పడుతున్న జనం**

**చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పాలకులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని రహదారులు నరకాన్ని తలపిస్తున్నాయి. గల్లీ రహదారులే కాదు ప్రధాన రహదారులది సైతం ఇదే పరిస్థితి. ప్రతి డివిజన్ లోనూ అడుగుకో గుంత అన్నట్లుగా రహదారులు మారడంతో ఆయా ప్రాంతాలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. బల్దియా సాధారణ నిధులనుంచి నగరంలోని రహదారులను మరమ్మతు చేయాల్సి ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో ప్రత్యేక రాష్ట్రంలోనూ పాత పరిస్థితులే కనిపిస్తున్నాయంటూ స్థానికులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. గతంలో రహదారులకు ప్యాచ్ వర్క్ అయినే చేసేవారని, నేడు అదికూడా కరువైందరి విమర్శిస్తున్నారు.

### బాధ్యత బల్దియాదే..

నగరంలో రహదారులు గుంతల మయంగా మారడానికి పూర్తి బాధ్యత బల్దియా పాలకవర్గానిదేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాగునీటిని సక్రమంగా పంపిణీ చేయడంలో గ్రేటర్ ఇంజినీర్లు పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాగునీటి పైప్ లైన్ ల లీకేజీలే రహదారులు పాడవడానికి కారణంగా మారుతున్నాయంటున్నారు. అయితే నగరంలో చిన్న, పెద్ద లీకేజీలను కలుపుకొని వెయ్యికిపైగానే ఉన్నట్లు బల్దియా అధికారులే అంగీకరిస్తున్నారు.

### వివిధ వ్యాధులకు కారణం..

నగరంలోని 66 డివిజన్లలో ఎక్కడో ఒక చోట లీకేజీలు దర్శనమిస్తూనే ఉన్నాయి. అయితే లీకేజీలను అరికట్టడంలో బల్దియా ఇంజినీర్లు పూర్తిగా విఫలమయ్యారు. బల్దియా కార్యాలయంలో రివ్యూలకే పరిమితమైన మేయర్, కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడంతో లీకేజీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందే తప్ప తరగడంలేదు. అయితే ఈ లీకేజీలే వివిధ వ్యాధులకు కారణంగా మారుతున్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు లీకేజీల ద్వారా పైప్ లైన్లలోకి చేరి అక్కడి నుంచి ఇంటింటికీ సరఫరా అవుతోందంటున్నారు. దీంతో కలుషితమైన నీరే నగర ప్రజలకు అందుతోందని, దీనిని తాగడం ద్వారా వివిధ వ్యాధుల బారిన పడుతున్నారన్న విమర్శలున్నాయి. పైప్ లైన్ లీకేజీలను అరికట్టాలని నగర ప్రజలు ఎంతో కాలంగా మొరపెట్టుకుంటున్నా బల్దియా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పైప్ లైన్ లీకేజీలను అరికడితే తాగు నీరు కలుషితం కాకుండా రక్షించడంతోపాటు రహదారులు గుంతలమంగా కాకుండా కాపాడవచ్చని గ్రేటర్ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ దిశగా బల్దియా అధికారులు అడుగులు వేయాలంటున్నారు.



## మత్తు పదార్థాలు వద్దు..

# భవిష్యత్ ముద్దు

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**విద్యార్థులకు అవగాహన సదస్సు**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించి యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విద్యార్థులకు సూచించారు. మామూనూర్ పోలీసుల అధ్వర్యంలో బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సీపీ తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్యేశించి సీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్ ప్రమాదంలో పడుతోందన్నారు. ఈ ప్రమాదంలో పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షణికానందం కోసం మత్తు పదార్థాలు సేవించడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరన్నారు. కొంత మంది డబ్బు, సంపాదన కోసం గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడి యువతకు అందించడం జరుగుతోందని ఇలాంటి స్వార్థపరుల చేతుల్లో యువత బలికావద్దన్నారు. ఎన్నో ఆశలతో మిమ్మల్ని ఉన్నత చదువులు చదివించి మీ బంగారు భవిష్యత్తుకై ఎదురుచూసే తల్లిదండ్రులకు తమ పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారారన్న వార్త వేదనకు గురి చేస్తుందన్నారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, ఎన్నో ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతాయన్న విషయాన్ని యువత గ్రహించాలన్నారు. అలాగే మీ తోటి మిత్రులు గంజాయిని సేవిస్తున్నట్లయితే మత్తు పదార్థాల వినియోగం ద్వారా నష్టాలపై వారి అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా గంజాయి లాంటి మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరువ చూపిస్తోందని వివరించారు. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నియంత్రణకై డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడ్కైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నా, రవాణా, విక్రయాలు పాల్పడుతున్న వారిని పట్టుకోవడే ఈ విభాగం ప్రత్యేకతన్నారు. ఎవరైన మత్తు పదార్థాలు అమ్మిన, సేవించిన 8712584473కు సమాచారం అందించడం ద్వారా వారిపై తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పెద్దఎత్తున గంజాయి సమచారం అందించిన వారికి నగదు పురస్కారం కూడా అందజేస్తామన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, మామూనూర్ ఏసీపీ తిరుపతి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి, ఏనుమాముల ఇన్స్పెక్టర్ పులి రమేష్, వాగ్దేవి కళాశాల ప్రిన్స్‌పాల్స్ డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ సయ్యద్ ముస్తాక్ ఆహ్మద్, వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ తిరుపతి, ఎస్సైలు శ్రీకాంత్, సురేష్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మొక్కతో మొక్కులు చెల్లిస్తాం..



**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం వన దేవతల దర్శనం కోసం వచ్చే భక్తులతోనే మొక్కలు నాటించేలా 'మొక్కతో మొక్కులు చెల్లిస్తాం..'అనే విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కోరారు. జాతర సందర్భంగా అటవీ విస్తీర్ణం తగ్గిపోతున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు కొత్త ప్రతిపాదనను అమలు చేయడం ద్వారా ప్రయోజనం చేకూరుతుందన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 13.45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్ణయించినట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజలను భాగస్వాములను చేసి లక్ష్యాన్ని సాధించాలన్నారు. సోమవారం ములుగు మండలంలోని ఇంచర్ల ఎర్ర గట్టమ్మ వద్ద 63 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న గట్టమ్మ ఏకో పార్క్ లో మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ షభరిష్, సీసీఎఫ్ ప్రభాకర్, ఐఎఫ్ఎస్ లతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 75వ వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలలో అధికారులు, ప్రజాప్రనిధులు కలిసి మొక్కలు నాటే కార్యక్రమాలను దిగ్విజయం చేయాలన్నారు. నాటిన మొక్కలకు ట్రీ గార్డ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల కోసం ఇంచర్ల గ్రామ సమీపంలోని ఎర్ర గట్టమ్మ వద్ద అర్బన్ పార్క్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అడవి చాలామందికి ఆకలి తీర్చే ఆదాయ కేంద్రమన్నారు. సగటు మానవ జీవితం అటవీపైనే ఆధారపడుతుందని, పిల్లల మనసు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో అంతటి స్వచ్ఛమైన ఆహారాన్ని అడవి నుంచి పొందవచ్చన్నారు. అనంతరం జిల్లాలో వనమహోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, షీల్డ్ లను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్ డి మహేష్ బి గీతే, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా భారీ వర్షం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నాలుగు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి మండలంలోని వాగులు, చెరువులలోకి భారీగా వరద నీరు చేరింది. వర్షాకాలం ప్రారంభం నుంచి సరైన వర్షం లేక ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. భారీ వర్షానికి మండలంలోని కొండంపేట, వల్లెంకుంట చెరువులలోకి భారీ వరద నీరు చేరింది. కుంభంపల్లి శివారులో ఉన్న కుంభం మాటు మత్తడి దూకింది. ఆదివారం కురిసిన భారీ వర్షం ఈ సీజన్ లో అతి పెద్ద వర్షమని, ఈ వర్షంతో వరి పంట సాగుకు అడ్డంకులు తొలగిపోయాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** అంగన్వాడీల పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర అంగన్వాడీ శాఖ పిలుపు మేరకు సోమవారం పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు డివిజన్ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఇంచార్జి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకురాలు ఎల్.శ్రీలతకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంగన్వాడీలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు బొల్లం అశోక్, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి పసుల స్వరూపలు సంయుక్తంగా మాట్లాడుతూ అంగన్వాడీలకు నష్టం చేకూర్చే జీఓ నంబర్ 10ని తక్షణమే రద్దు చేయాలన్నారు. అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్స్ కు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తన మేనిఫెస్టో లో పెట్టిన హామీలను అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు సుకన్య, మంజుల, ఝాన్సీ, సైదాబీ, అంగన్వాడీ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల విస్మరణపై ఆందోళనలకు సిద్ధం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలో ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో జాప్యాన్ని నిరసిస్తూ దశల వారి ఆందోళనకు సిద్ధం కావాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా తొర్రూరు డివిజన్ కార్యదర్శి, ముంజంపల్లి వీరన్నఅన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ముద్రించి కరపత్రాలు నేడు నెల్లికుదురులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 22న మండల కేంద్రాలలో 29న జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలని, ఇంటి స్థలం గృహ నిర్మాణానికి 10 లక్షలు ఇవ్వాలని, పెన్షన్లను పెంచి అమలు చేయాలని అన్నారు. రైతాంగానికి రుణమాఫీ వెంటనే అమలు చేస్తూ కొత్త రుణాలు ఇవ్వాలని, 10 ఎకరాల లోపు రైతులందరికీ రైతు భరోసాను ఇవ్వాలని కౌలు రైతులకు వర్తింపచేయాలని అన్నారు. వ్యవసాయ కార్మికులకు రూ.12,000 జీవన భృతి వెంటనే మంజూరు చేస్తూ, భవన నిర్మాణ ఇతర సంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. స్కాలర్ షిప్ పెంచుతూ, ఫీజు రియింబర్స్ మెంట్ ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యుద్ధం ప్రాతిపదికన ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే మండల జిల్లా కేంద్రాలలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లికుదురు సంయుక్త మండలాల కమిటీ కార్యదర్శి ఇరుగు అనిల్ తో పాటు మల్లయ్య వెంకన్న, రాములు సైదులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కులగణన చేసే వరకు పోరు ఆపేది లేదు

### 18న కుల గణన సాధన యాత్ర సభ
### బీసీ సంఘం నేత బైరి రవి కృష్ణ గౌడ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దమాషా ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. ఆదివారం హన్మకొండ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరీ రవి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీలకు తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతానికి బీసీ రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీనిచ్చిందని, ఇచ్చిన హామీని ఎన్నికల్లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి, ప్రభుత్వం పైన నిరంతరం ఒత్తిడి పెంచడానికి, బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల ఐకాస ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సాధన యాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యాత్ర ఈనెల 14న కామారెడ్డి నుంచి ప్రారంభమై కరీంనగర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజుల పాటు ఉంటుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 18న హనుమకొండ హంటర్ రోడ్డు సత్యం కన్వెన్షన్ హాల్ లో సమగ్ర కులగణన సాధన యాత్ర సభ ఉంటుందని, ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ కులస్తులందరూ, కులాల కతీతంగా, పార్టీలకతీతంగా ఏకమై సమగ్ర కులగణన సాధన యాత్ర సభలో అత్యధికంగా పాల్గొని, బీసీల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, దాడి మల్లయ్య యాదవ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్, బీసీ మహిళ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మెల శోభరాణి, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, డా.ఒడితల రాము, అరేగంటి నాగరాజు, కురిమిళ్ల శ్రీనివాస్ గౌడ్, మారగోని రవి, తంగళ్లపల్లి రమేష్, పెరుమాండ్ల అనిల్, రాధిక, ప్రమోద, కాశెట్టి రాజేష్, నాగరాజు పాల్గొన్నారు.

## అమ్మ మాట.. అంగన్వాడీ బాట

### కార్పొరేటర్ పల్లం పద్మ రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అమ్మ మాట.. అంగన్వాడీ బాట 32వ డివిజన్ కమ్యూనిటీ హాల్ లో ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్టు ఉర్సు సెక్టార్ సూపర్ వైజర్ బత్తిని రమాదేవి అధ్యక్షతన జులై 15 నుంచి 20 వరకు జరుగుతున్న అమ్మ మాట.. అంగన్వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పల్లం పద్మ హాజరై అంగన్వాడీ కేంద్రాలలో మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆటపాటల విద్య, ఆరోగ్యంగా ఉండుటకు పౌష్టికాహారం ఇవ్వడం, అంగన్వాడీ టీచర్లు పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించారు. కాబట్టి, ప్రతి ఒక్క తల్లిదండ్రులు అంగన్వాడీ సెంటర్లను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లలకు జులై కార్యక్రమాలు అంగన్వాడీ టీచర్లు చేయించారు. అనంతరం ర్యాలీ, వన మహోత్సవం సందర్భంగా కార్పొరేటర్ పద్మ మొక్క నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్లు శ్రీలత, విజయలక్ష్మి, స్వరూప, సరిత, సవిత, కళ్యాణి, సునీత, ఆర్పీ కృష్ణవేణి, ఓబీ పద్మ, ఏఎల్ఎంసీ కమిటీ సభ్యులు, తల్లులు, పిల్లలు ఆయాలు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఒకటో వార్డులో సానిటేషన్ పనులను కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ చేయించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ వానాకాలం ప్రారంభమై వాతావరణ మార్పులతో ప్రజలు రకరకాల వ్యాధులు, సీజనల్ వ్యాధులు, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో పరిశుభ్రంగా లేని ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. దోమల వలననే వ్యాధులన్నీ వస్తాయని అన్నారు. పారిశుద్ధ్యం చక్కగా జరిగేలా చూడాలని, ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాలని, ఫాగింగ్ చేయించాలని, బ్లీచింగ్ చల్లించాలని, డ్రైనేజీల వెంట, రోడ్ల వెంట పిచ్చి మొక్కలు తీయించాలని చైర్ పర్సన్‌ను, కమిషనర్‌ను కోరారు.

# రైతులను అడ్డుకోవడం సిగ్గుచేటు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న రైతు భరోసా కార్యక్రమానికి వెళ్తున్న రైతు సంఘం నాయకులను పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటని అఖిల భారత రైతు సమఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి, అఖిల భారత వ్యవసాయ కార్మిక సమఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె కుమార్ స్వామి మండిపడ్డారు. ఈ సందర్భంగా హంసా రెడ్డి, గోనె కుమారస్వామి మాట్లాడుతూ సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే రైతు భరోసా కార్యక్రమానికి రైతు సంఘాల నుంచి ప్రతినిధులుగా మేము హాజరై రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లడానికి రావడం జరిగింది. కానీ, రాష్ట్ర మంత్రుల ఆదేశాల మేరకు లోనికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. వాస్తవికంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెట్టినప్పుడు దాదాపుగా 500 నుంచి 600 మంది రైతు ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉందని కలెక్టర్లకు తెలుసు కానీ, 500 మంది కూర్చొని కెపాసిటీ హాల్ మాట్లాడకుండా చిన్న హాల్లో కూర్చోబెట్టి తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ను తీసుకువచ్చిన తర్వాత రైతులు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటూ పరిష్కారం కొరకు సంవత్సరాల కొద్దీ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదు, గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి భూ సమస్యలు లేకుండా సమగ్ర భూ సర్వే చేసి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి, అ హామీని తుంగలో తొక్కి రైతు సమస్యలు గాలికి వదిలేశారు. దాని ఫలితమే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులు ఓడించారు. రైతుల పక్షపాతి అయిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల దయ చూసి ధరణి పోర్టల్ ను ప్రక్షాళన చేసి రైతుల భూ సమస్యలను వెంటనే బహిష్కరించి, అలాగే రైతు భరోసా 10ఎకరాల లోపు కటాఫ్ పెట్టి ఇవ్వాలని, సమగ్ర భూ సర్వే చేపట్టి రైతులకు హద్దులను సర్వే నెంబర్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సాగు చేసే వారికి మాత్రమే రైతు భరోసా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కౌలు రైతులను గుర్తించి వారికి కూడా రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భారత రైతు కూలి సంఘం నాయకులు రాచర్ల బాలరాజు, అఖిల భారత రైతు సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు వక్కల కిషన్, జిల్లా నాయకులు దామర కొండ రమేష్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, మొగిలి, శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

## పల్లెబోయిన అశోక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముదిరాజ్‌లను బీసీ -ఏలో చేర్చాలని, ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బస్టాండ్ వద్ద ఉన్న తమసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు సోమవారం వినతిపత్రం అందజేచేశారు. అనంతరం పెద్ద ఎత్తున ముదిరాజులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముదిరాజుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలను అందించే కార్యక్రమాన్నితెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందని వివరించారు. తెలంగాణలో అధిక జనాభాగల ముదిరాజ్ లు సమాజంలో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామన్నారు. ప్రభుత్వంలోని మంత్రివర్గంలో ముదిరాజులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజుల అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటివ్ సోసైటీ లిమిటెడ్ ఏర్పాటుతో పాటు ప్రతి సంవత్సరానికి రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్య శాఖలోని సొసైటీలకు ఎన్నికలు జరపాలని, మత్స్యకారులకు 50 ఏండ్లకే ఆసరా పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ముదిరాజ్‌లకు ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని అన్నారు. జనాభా ప్రాతిపదికన ముదిరాజ్లకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వే (2014 ) అనంతరం ముదిరాజ్‌ల జనాభా 60 లక్షలు కాగా, నేడు మళ్లీ జనగణన చేపట్టాలని కోరారు. ముదిరాజ్‌ల జనాభా తెలపాలని, ఆ దామాషాలో అన్ని అభివృద్ధి ఫలాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేశబోయిన శ్రవణ్, బయ్య శోభన్, ఇప్ప సాంబమూర్తి, పులి ప్రభాకర్, రామ్‌రాజ్, సమ్మయ్య, నర్సింగరావు, శంకర్, రమేష్, ప్రకాశ్, రవికుమార్, మహేందర్, కోటేశ్వర్, రాజ్ కుమార్, కృష్ణ, హరికృష్ణ, గోపి కృష్ణ, పెద్ద ఎత్తున ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** నిరుపేద మృతుల కుటుంబాలకు అండగా ఉండి వారిని ఆర్థికంగా ఆదుకుంటామని ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్)వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ తెలిపారు. ఆత్మకూరు మండలంలోని నాగయ్యపల్లికి చెందిన ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) గ్రామ శాఖ అధ్యక్షుడు మాదాసి రాజు తల్లి మాదాసి వీరలక్ష్మి ఇటీవలి కాలంలో అనారోగ్యంతో మరణించగా దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ ద్వారా విషయం తెలుసుకున్న కలకోటి మహేందర్ తో పాటు వర్తమాన కవి, రచయిత సత్య కలకోటి, బహుజన గాయకుడు గోల్కొండ భిక్షపతి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కలకోటి మహేందర్ మాట్లాడుతూ మాదాసి వీరలక్ష్మి చూపిన మహనీయుల బాటలో ఆమె కుమారుడు మాదాసి రాజు పయనిస్తూ దళిత శక్తి ప్రోగ్రాం, ధర్మసమాజ్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి గ్రామ శాఖ అధ్యక్షుడిగా, మండల నాయకుడిగా సమ సమాజం కోసం పాటుపడుతున్నాడని ఈ తరుణంలో ఆమె మరణించడం మాదాసి రాజుతో పాటు ఆమె కుటుంబానికి తీరని లోటన్నారు. ఆమె కుటుంబానికి దళిత, బహుజన, సామాజిక, ప్రజాసంఘాలు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్)జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, నాయకులు మాదాసి శ్రీనివాస్, గిన్నారపు భాస్కర్, జినుక అశోక్, మాదాసి సుదర్శన్, మాదాసి నవీన్, గిన్నారపు ప్రమీల, గిన్నారపు సౌమ్య, మారెపల్లి జ్యోతి బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మ మాట-అంగన్వాడి బాట ర్యాలీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** పిల్లలను చిన్నతనంలో అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించినట్లయితే విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, మంచి ఆహారపు అలవాటు కలిగి ఉంటారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. కరీమాబాద్ సెక్టార్ అంగన్వాడీ సూపర్ వైజర్ మాధవి ఆధ్వర్యంలో జరిగిన అమ్మ మాట–అంగన్వాడి బాట ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ మరుపల్ల రవి ర్యాలీని ప్రారంభించి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలలో ఎల్ కేజీ, యూకేజీ, నర్సరీ క్లాసులు ఏర్పాటు చేసి బోధనన చేస్తున్నందున తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు బీద మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కరీమాబాద్ సెక్టార్ అంగన్వాడీ సూపర్ వైజర్ మాధవి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ సెంటర్లలో చిన్నపిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు సంపూర్ణ ఆరోగ్యానికి డాక్టర్లచే పరీక్షలు నిర్వహించి తగిన మందులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో అంగన్వాడీ టీచర్లు ఆయాలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలి

### ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట ధర్నా



**వరంగల్ వాయిస్, మరిపెడ :** అంగన్వాడీలకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, టీచర్లకు రెండు లక్షలు, ఆయాలకు లక్ష రూపాయలు ఇవ్వాలని కోరుతూ సోమవారం డోర్నకల్ నియోజకవర్గ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మరిపెడలోని డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడుతూ అంగన్వాడీలకు తక్షణమే రిటైర్ మెంట్ బెనిఫిట్ రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు ఇవ్వాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె సందర్భంగా 2 లక్షలు,హెల్పర్స్ కు లక్ష, పెన్షన్స్ సౌకర్యం, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చింది. అనంతరం ప్రభుత్వం మారి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి ఏడు నెలలు గడుస్తున్నా అంగన్వాడీల పట్ల కక్షపూరితంగా పాత జీవో 10ని తీసుకు వచ్చి అతి తక్కువ డబ్బులు ఇచ్చి 65 సంవత్సరాలు దాటిన వారందరిని నిర్దాక్షణ్యంగా జులై 1 నుంచి ఇంటికి పంపాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఈనెల 19న శిశు సంక్షేమ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామచంద్రనాయక్ అందుబాటులో లేకపోవడంతో వారు ఫోనులో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న, సీఐటీయూ నాయకులు నందిపాటి వెంకన్న, కొండ ఉప్పలయ్య, బండ వీరస్వామి, అలాగే నరసింహుల పేట, దంతాలపల్లి ,చిన్న గూడూరు, మరిపెడ, కురవి, డోర్నకల్ మండలాల అంగన్వాడీ వర్కర్స్, యూనియన్ లీడర్లు, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

## బీరన్న బోనాలకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనెల 17న తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా కరీమాబాద్ లో శ్రీ బీరన్న స్వామి దేవస్థానం కమిటీ వారి ఆధ్వర్యంలో జరిగే బీరన్న బోనాల పండుగకు హాజరుకావాలని సోమవారం 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవిని కలిసి ఆహ్వాన పత్రికను దేవస్థానం కమిటీ సభ్యులు అందించారు.

## ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణ పరిరక్షణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మోంట్రా ఎలక్ట్రిక్ ఆటో కీర్తి మోటార్స్ వారి ఆధ్వర్యంలో సోమవారం ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియంలో టెస్ట్ రైడ్ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎస్ఎం సందీప్ నాయుడు, సేల్స్ మేనేజర్ శ్రావణ్ రెడ్డి, సేల్స్ మేనేజర్ ఖధీర్, సర్వీసు మేనేజర్ శ్రీహర్ష, కీర్తి మోటార్స్ షోరూం ఎండీ చందుపట్ల కీర్తి సత్యపాల్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మోంట్రా ఎలక్ట్రిక్ ఆటో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించడం వలన వాతావరణంలో కాలుష్యం అనేది తగ్గి అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంతేకాకుండా 50 రూపాయల ఖర్చుతో 160 కిలోమీటర్లు ప్రయాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వరంగల్, హనుమకొండ ఆటో డ్రైవర్లందరికీ ఉచితంగా ఆయిల్ ఛేంజ్, ఆయిల్ ఫిల్టర్ చేశారు. అనంతరం టేస్ట్ రైడ్ చేసిన వారిలో లక్కీ డ్రా కూడా తిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ రోడ్డా మురళీకృష్ణ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ గణేష్, అశోక్, ఫారుక్, సర్వీసు ఇంచార్జ్ రామచంద్రయ్య, శ్వేత రెడ్డి, రాజేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం, ఏబీవీపీ నాయకుల అరెస్ట్



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** డీఎస్సీ వాయిదా వేయాలని గ్రూప్ 1,2 పోస్ట్ లు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని బీజేవైఎం, ఏబీవీపీ నాయకులను అర్ధరాత్రి 11గంటల సమయంలో భారీ వర్షంలో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టైన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి జోగేశ్వర్ రావు, కార్యదర్శి బల్ల సంపత్, ఏబీవీపీ నగర కార్యదర్శి పేట సాయి, నాయకులు గోగుల కృష్ణ, రవితేజ, సుశాంత్, వెంకటేష్, సంజయ్ లు ఉన్నారు.

## చిర్ర రాజును సన్మానించిన పార్ట్ టైం అధ్యాపకులు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు కొన్నేళ్లుగా జీత భద్రత లేక ఇబ్బందుల పాలవుతున్నారని కాకతీయ వర్సిటీ పార్ట్ టైం అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను గాలికి వదిలేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పార్ట్ టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని వర్సిటీ పార్ట్ టైం అధ్యాపకులు కోరారు. ఈ సమస్యలన్ని తెలిసిన వ్యక్తి డా.చిర్ర రాజు ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడిగా నియమింపబడటం సంతోషమని ఆయన్ని ఈ సందర్భంగా అభినందించారు. పార్ట్ టైం జీత భద్రత గురించి ప్రభుత్వానికి తెలియజేయాలని, ఫుల్ వర్క్ లోడ్ ఉన్నవాళ్లు అందరికి జీత భద్రత కల్పించే విధంగా కాంట్రాక్టువల్ గా కన్వర్ట్ చేసే భాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పార్ట్ టైం అధ్యాపకులు కేయూ పాలకమండలి సభ్యుడైన డా.చిర్ర రాజును ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సదానందం, డాక్టర్ నాతి చందర్, డాక్టర్ టి మౌనిక, డాక్టర్ హెచ్ రమాదేవి, డా.టి.భిక్షపతి, డాక్టర్ అచ్చయ్య, డా.సద్గుణ, కెమిస్ట్రీ సతీష్, డాక్టర్ చింతం ప్రవీణ్, డాక్టర్ ఫరః ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# పనులు చేసిన వారికే బిల్లులు చెల్లించాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మన ఊరు-మనబడి పథకం ద్వారా వరంగల్ జిల్లాలో ఉన్న గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి స్కూల్ పేరెంట్స్ కమిటీ తీర్మానం ప్రకారం ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాల స్కూల్ కాంపౌండ్ వాల్ బిల్డింగులు మరుగుదొడ్లు, మూత్రశాలలు మేజర్ మైనర్ రిపేరింగ్ నిర్మాణ పనులు చేశారు. వారికి కాంగ్రెస్ ప్రభుత్వం, జిల్లా అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించి అభివృద్ధి పనులు చేసిన వారిని ఆదుకోవాలని రివల్యూషన్ సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో అభివృద్ధి పనులు చేయాలనే ఉద్దేశంతో కొంతమంది సాధారణ వ్యక్తులు స్కూలు అభివృద్ధి పనులు చేయడం కోసం అప్పులు తెచ్చి గ్రామంలో ఉన్న స్కూల్ అభివృద్ధి పనులు చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు వారికి సకాలంలో బిల్లులు రాకపోవడంతో వడ్డీ పెరగడంతో అభివృద్ధి పనులు చేసిన వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన ఊరు-మన బడి నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో మళ్లించడంతో గతంలో పనులు చేసిన వారికి పెండింగ్ బిల్లులు చెల్లించవలసిందిగా జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. లేకుంటే జిల్లావ్యాప్తంగా దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పీ నాయకులు దుబ్బర సురేందర్, బానోతు పుణ్య నాయక్ పాల్గొన్నారు.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్లు పథకం అమలు




**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు, జీరో కరెంటు బిల్లు, 500లకు వంటగ్యాస్ సిలిండర్ వంటి స్కీములను ఇప్పటికే పలువురు లబ్దిదారులు అందుకుంటున్నారని, తెలంగాణలో మహిళలకు ఫ్రీ బస్సు విజయవంతంగా అమలవుతోందని బొమ్మ కంటి చంద్రమౌళి ఎస్సీబీ భాగం అధ్యక్షుడు అన్నారు. మహిళలు రూపాయి కూడా చెల్లించుకుండానే ఆధార్ కార్డు చూపిస్తూ జర్నీ చేస్తున్నారు. అయితే ఇప్పుడు ప్రజలకు మరో గుడ్ న్యూస్ అందించింది రేవంత్ సర్కార్. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై తాజా అప్ డేట్ అందించింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు గ్రామ సభలు నిర్వహించి సెలక్ట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే దీనికి సంబంధించిన ఆదేశాలు రానున్నట్లు సమాచారం. ఈ పథకం కింద తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి ఆర్థిక సాయం అందిస్తారు. రెండో దశలో లబ్దిదారులకు ఇంటి స్థలంతో పాటు ఆర్థిక సాయం అందిస్తారు. తొలిదశలో నియోజకవర్గానికి 3500 ఇళ్లు చొప్పున మంజూరు చేస్తుంది. ఇంటి నిర్మాణానికి లబ్ధి దారులకు రూ. 5లక్షల రూపాయలను మూడు విడతల్లో వారి ఖాతాల్లో జమ చేస్తుంది. ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద ఏడాదికి రూ. 4.50లక్షల ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలోనే వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుమీదనే మంజూరు చేస్తామన్నారు. ఈ పథకాన్ని హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్ లు మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారని మంత్రి తెలిపారు. సొంతిళ్లు ఉండాలని ప్రతి పేదవాడికి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుపేదలకు ఇంది రమ్మ ఇళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇళ్లు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

# వాగు ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్డు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో వాగుఉధృతికి తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణంలో ఉండగా తాత్కాలిక రోడ్డును వేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు వరద ఉధృతికి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. పరకాల నుంచి హనుమకొండకు అంబాల మీదుగా వెళ్లే రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసిల్దార్ ఆర్.సత్యనారాయణ, ఆర్ఐ లావుడియా హేమా నాయక్‌లు పరిశీలించి రాకపోకలను నిలిపివేసినట్టుగాతెలిపారు.అంబాల హనుమకొండకు వెళ్లే బస్సులను శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి, అంబాల మీదుగా మళ్లించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

# అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, శాయంపేట :** పెద్దకొడపాక గ్రామానికి చెందిన కారంగుల శంకర్ వ్యవసాయ పెట్టుబడికి, ట్రాక్టర్ కొనుగోలు, చికెన్ షాప్ పెట్టేందుకు కొంత మేర అప్పు చేయడం జరిగింది. ఈ అప్పులు తీర్చలేక ఈ నెల 14న రాత్రి 10 గంటలకు ఇంట్లో పైకప్పు దూలానికి లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయిన వ్యక్తి భార్య కారంగుల లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం డెడ్ బాడీనిని పరకాల సీహెచ్ సీకి తరలించారు

# సీతారామ ప్రాజెక్టు జలాల సాధనకు పోరాడుదాం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2016 ఫిబ్రవరి 16న శిలాఫలకం వేసి హామీ ఇచ్చిన ప్రకారం రోళ్లపాడు రిజర్వాయర్ నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ఇల్లందు, కొత్తగూడెం, మణుగూరు, డోర్నకల్, ములుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏజెన్సీ మండలాలన్నింటికీ మొట్ట మొదటగా సాగునీరు అందించేందుకు, ఆదివాసుల భూములను మూడు పంటలు పండే విధంగా సస్యశ్యామలం చేస్తామని ఇచ్చిన హామి అమలు కోసం ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ అన్నారు. ఏజెన్సీ మండలాలలకు సీతారామ ప్రాజెక్టు జలాల సాధన కోసం రేపు రెండు న్యూడెమోక్రసీల ఆధ్వర్యంలో ఇల్లందులో జరుగు సదస్సును జయప్రదం చేయాలన్నారు. సీతారామ ప్రాజెక్టు జలాల సాధన కోరుతూ సోమవారం బయ్యారం గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రం ముందు జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ ప్రసంగించారు. తన పదేళ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం ఈప్రాజక్టును విస్మరించిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం డిజైన్ మార్చివేయడం, డీపీఆర్ లో ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్, బయ్యారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లను విస్మరించి నాగార్జున సాగర్ పాత ఆయకట్టు స్థిరీకరణ కోసమే సీతారామ ప్రాజెక్టును నిర్మిస్తున్నారని ఆయన అన్నారు. ఆదివాసీ మండలాలకు జరుగుతున్న అన్యాయం ఎడల ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలు చోద్యం చూశారన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్టుగా సీతారాం ప్రాజెక్టు నీళ్లను మొట్ట మొదటగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం, మణుగూరు, పినపాక, భద్రాచలం, బూర్గంపాడు, పాల్వంచ, లక్ష్మీదేవి పల్లి, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి, ఇల్లందు, గార్ల, బయ్యారంతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, కొత్తగూడెం, గార్ల, బయ్యారం తదితర ప్రాంతాలకు సాగునీరు అందించే విధంగా తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ నాయకులు కొదుమూరి నాగేశ్వరరావు, కోనూరి యుగందర్, పొన్నం రమేష్, వీరబోయిన ఐలయ్య, నిడికొండ మహేష్, నేతకాని రాకేష్, ఊకె శేషు, కసనబోయిన స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి

## తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సమావేశం సోమవారం వరంగల్ నగరం అడ్డకుంటలో రైతు సంఘ భవనంలో సోమరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘ నిర్మాణ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యక్షంగాను పరోక్షంగాను నేటికీ 75శాతం మందికి ఉపాధినిస్తున్న మన వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న సాంకేతిక, నాగరిక విలువలకు తగిన విధంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు ప్రణాళిక బద్ధంగా పనిచేయడంలో చిత్తశుద్ధిని చూపలేకపోయిన కారణంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కూడా నష్టాలలోనే మూతపడ్డాయని తెలిపారు. లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు నిరుద్యోగులుగా మారిపోయారు. శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వాలు ఆలోచించకపోవడం దురదృష్టకరమని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ ఈ సందర్భంగా అన్నారు. జిల్లా కమిటీ కొన్ని డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ఉంచింది. మద్దతు ధరను చట్టబద్ధత చేయాలని, వ్యవసాయ రంగానికి జాతీయ ఉపాధి హామీ పథకం వర్తింప చేయాలని, రైతుల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారికి ఉచిత విద్య, వైద్యం అందించాలని, ప్రభుత్వం గ్యారంటీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు 75 శాతం సబ్సిడీతో ప్రభుత్వమే అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వదల రాజయ్య, కోశాధికారి సెల్ల రవీందర్, ఉపాధ్యక్షుడు అంశాల్ రెడ్డి, కమిటీ సభ్యులు బరపటి రవీందర్, సోమిరెడ్డి సాంబయ్య, పేరయ్య, బుల్లయ్య, రాజమౌళి, పైడి జెండా, అంబయ, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# మూడేళ్ల లోపు పిల్లలకు అడ్మిషన్ ఇవ్వొద్దు

## ఇస్తే ఆ పాఠశాల పర్మిషన్ రద్దు చేయాలి

## అంగన్వాడీ టీచర్ నారగాని అనిత



**వరంగల్ వాయిస్, నడికూడ :** పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యపరంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అంగన్వాడీ కేంద్రాలను నిర్వహించడం జరుగుతుందని అంగన్వాడీ టీచర్ నారగాని అనిత తెలిపారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు మెదడు అభివృద్ధితో పాటు శారీరక ఎదుగుదల గురించి ఆటపాటలతో కూడిన ఫ్రీ స్కూల్ విద్యను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మంచి పౌష్టికాహారమైన గుడ్డు, బాలామృతం, పోషక విలువలతో కూడిన భోజనం అందిస్తూ పిల్లల్లో నైపుణ్య అభివృద్ధిని మెరుగుపరుస్తుంటే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల మోజులో పడి రెండు సంవత్సరాలు కూడా నిండని పిల్లలను బడులకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వ ప్రాథమిక విద్యా పూర్తవని పిల్లలను ప్రాథమిక విద్య వైపు మళ్లిచడం వలన పిల్లల్లో నైపుణ్యం దెబ్బ తినడమే కాక వారి బతుకులు చిద్రమవుతాయన్నారు. ఆరోగ్యం క్షీణించి మానసికంగా కృంగిపోయి రక్తహీనతలకు గురయ్యి వారి భవిష్యత్తు అంధకారం కాముందే అమ్మ తర్వాత అమ్మ లాంటి అంగన్వాడీకి పంపించాలని నడికూడ అంగన్వాడీ టీచర్ నారగాని అనిత పిలుపునిచ్చారు. దారిద్ర రేఖకు దిగువ ఉన్న పిల్లలు పేద, మధ్య తరగతి పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలు ఆధునిక దేవాలయాలుగా వారి పాలిట ఆటపాటల ఆరోగ్య కేంద్రాలుగా ఆహ్వానాలు పలుకుతున్నాయని, ఐదు సంవత్సరాలలోపు పిల్లలను తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకే పంపించాలని కోరారు. తల్లిదండ్రులారా ఆలోచించండి చిన్నపిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. ఆడుకునే వయసులో వారిని యంత్రాలుగా మార్చకండి.. మీకోసం అంగన్వాడీ బడులు తెరిచే ఉంటాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి నాలుగు గంటల వరకు మీ పిల్లల బాధ్యత మాకు అప్పజెప్పండని పిలుపునిచ్చారు.

# గేట్‌లో సంకె పల్లవికి అల్ ఇండియా ర్యాంక్

## సన్మానించిన మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** గేట్ పరీక్షలో ఆల్ ఇండియా 104 ర్యాంకు సాధించిన తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన సంకే పల్లవిని సోమవారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలసి శాలువాతో సత్కరించి లాప్ టాప్ ను అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా సంకే పల్లవి మాట్లాడుతూ మంత్రి, కలెక్టర్ల తో ఈ రోజు వేదిక పై నిలబడి సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆనందం పంచుకుంది. విద్యార్థులు పాఠశాల దశ నుంచే జీవిత ఆశయం కోసం అహర్నిశలు కృషి చేయాలని, చదువుకు ఏది ఆటంకం రాదని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించి గేట్ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించానని తెలిపింది. నాన్న మరణించినప్పటికీ కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, దాతల సహాయంతో చదివి ర్యాంకు సాధించానన్నారు.

# నాలాలపై అక్రమ నిర్మాణాల కూల్చివేత

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో నాలాలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. దామెర చెరువు మత్తడి కాల్వపై అక్రమంగా నిర్మించిన మంద వేణు నిర్మాణాన్ని పోలీసుల పటిష్ట బందోబస్తు ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు కూల్చివేశారు. వర్షాకాలంలో శ్రీనివాస కాలనీ పూర్తిగా నీటిలో మునిగిపోతుందని కాలువ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహ తెలిపారు. కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని మునిసిపల్ అధికారులు హెచ్చరించారు. బాధితుడు మంద వేణు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు పర్మిషన్ ప్రకారమే మా ఇంటి నిర్మాణం చేసుకున్నామని, అమాయకులమైన దళితులం తమ ఇల్లు కూల్చడం న్యాయం కాదని ఆ వేదన వ్యక్తం చేశారు. కాలనీ దళితులందరూ వేణుకు మద్దతుగా వాగ్వాదానికి దిగగా పోలీసులు వారిని చెల్లాచెదురు చేసి భవనాన్ని కూల్చారు. పరకాల, దామెర, శాయంపేట ఎస్సైలు, రెవెన్యూ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.





### భూములు కోల్పోయిన వారిని ఆదుకుంటాం..

దామర చెరువు మత్తడి నిర్మాణ పనులలో భూములు కోల్పోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, రైతులతో కలిసి రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. రైతులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

# కబేలాలకు పశువుల అక్రమ రవాణా

## కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీ నిరసన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని రహదారుల వెంబడి తిరిగే ఆవులను అక్రమంగా కబేళాల నిర్వాహకులు రహదారి పై రాజమార్గంగా తరలించుకుపోవడాన్ని నిరసిస్తూ విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. కబేలా నిర్వాహకులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి హిందు భారతి మాట్లాడుతూ పట్టణంలోని పలు వీధులలో తిరిగే ఆవులను కబేలాలకు తరలించడం దుర్మార్గమని, దీనిపై ప్రశ్నించగా మున్సిపల్ ఉద్యోగి ఈ ఆవులను తరలించమంటనే తీసుకుపోతున్నామని కబేలా నిర్వాహకులే చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధుల వెంబడి తిరిగే మూగజీవాలను మున్సిపల్ ఉద్యోగి అధికారుల కళ్లు గప్పి అక్రమార్జనకు కొత్త పుంతలు తొక్కుతూ గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళ కబేలాలకు తరలించుకపోతుంటే ఆవులను విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాత్రి వేళ గుట్టు చప్పుడు గాకుండా పెద్ద ఎత్తున పశువులను అక్రమంగా తరలించుకు పోతున్న కబేలాల నిర్వాహకులపైన, వీధులలో తిరిగే ఆవులను కబేళాలకు తరలించుకుపొమ్మని చెప్పిన మున్సిపల్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రహదారుల వెంబడి తిరిగే పశువులను బంజర దొడ్డికి అప్పజెప్పాలి కానీ, కబేలాలకు తరలించకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మురళి, బద్రి, ప్రేమ్ సాగర్, సంపత్, శ్రీను, రవి పాల్గొన్నారు.

# ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి







**వరంగల్ వాయిస్, జనగామ** :జాతీయ ఆరోగ్య మిషన్లో పని చేస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేసి వారి సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ (ఏఐటీయూసీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. పట్టణంలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవనంలో సీపీఐ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ (ఏఐటీయూసీ) జనగామ జిల్లా అధ్యక్షురాలిగా గంగరబోయిన జ్యోతి, ఉపాధ్యక్షురాలిగా ఓరుగంటి సమ్మక్క, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎలిమినేటి గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పారునాంది లిఖిత రాణి, ఉపాధ్యక్షురాలిగా ఏదునూరి పద్మ, ఉపాధ్యక్షుడిగా బానోతు భాస్కర్, కోశాధికారిగా చెన్నూరి మల్లేశం, జాయింట్ సెక్రటరీలుగా జేరిపోతుల ప్రియాంక, తీర్చి రజిని, చీఫ్ అడ్వైజర్ పనికెల సౌజన్య, ఈసీ మెంబర్స్ గా డాక్టర్. బగడం భార్గవి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కొండ్ర లత, ఈసీ సభ్యులుగా చిలుకమారి అంజయ్య, మరిపెల్లి కవిత తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ఒంటరి మహిళలకు పింఛన్లు తక్షణమే ఇవ్వాలి




**వరంగల్ వాయిస్, కేసముద్రం :** ఒంటరి మహిళలకు పింఛన్లు తక్షణమే ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయరాజు డిమాండ్ చేశారు. కేసముద్రంలోని కట్టు కాలువ తండాలో గత రెండు, మూడేళ్లుగా భర్తలు చనిపోయిన ఒంటరి మహిళలకు పింఛన్లు రావడం లేదని, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న గత ప్రభుత్వం ఒంటరి మహిళలకు పింఛన్లు ఇవ్వలేదని ఆయన తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్న పింఛన్ల ఊసేత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా ఒంటరి మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు వస్తాయని ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దరఖాస్తులు స్వీకరించి పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లౌడియా శారద, భూక్య రుక్మిణి, జటోత్ కవిత, మంద మమత, ఓర్సు సోమలక్ష్మి, ఉపేంద్ర, విజయ తదితరులు పాల్గొన్నారు.

# 18న బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 18న వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయం ధర్మారంలో జరగబోయే బీజేపీ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరగనుంది. సోమవారం బీజేపీ వరంగల్ జిల్లా కార్యాలయం -ధర్మారంలో ఉదయం 11: 00 గంటలకు బీజేపీ వరంగల్ జిల్లా పదాధికారులతో ఏర్పాటు చేసిన సన్నహక సమావేశంలో వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవి కుమార్ మాట్లాడుతూ 18న జరుగు కార్యవర్గ సమావేశం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సమావేశానికి వివిధ విభాగాలకు కమిటీలు వేశారు. అలాగే ఈ సమావేశం విజయవంతం చేసే విధంగా అందరూ కృషి చేయాలని సూచించారు.

# విద్యార్థులకు నోట్స్ బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలంలో స్థానిక ప్రభుత్వ కళాశాలలో సోమవారం కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాక్ టు స్కూల్-2024 కళాశాల ప్రిన్సిపాల్ ఆసనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్కూలు పిల్లలకు అమెరికా న్యూజెర్సీ నుంచి వచ్చిన ఎన్నారై డాక్టర్ సాయినాథ్, చిన్నారులు అది శ్రీ, కార్తీక్ లు కడియం ఫౌండేషన్ ద్వారా స్థానిక ప్రభుత్వ పాఠశాల పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ బ్యాక్ టు సొసైటీ అంటే సమాజానికి మన వంతు సేవ చేయడమేనని అన్నారు. చదువుతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విముక్తి కోరుతున్న.. బందెల దొడ్డి

## చిల్కోయలపాడు బందెల దొడ్డి గాయాబ్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ : సీరోల్** మండలంలోని చిల్కోయలపాడు గ్రామ బందెల దొడ్డి గాయాబ్ అయింది. 1994 సంవత్సరం అప్పటి సర్పంచ్ బోయిన భిక్షం సుమారు గుంట స్థలాన్ని గ్రామంలో బందెల దొడ్డి నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు. దీంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థలంలో షెడ్డు నిర్మాణానికి నిధులు కెటాయించి తప్పిపోయి గ్రామానికి చేరిన బర్రెలను కట్టేందుకు బందెల దొడ్డి స్థలం చుట్టూ గోడ నిర్మించి గేటును ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా సర్పంచ్ బోయిన భిక్షం తనకు ఉన్న రెండు గుంటల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి విక్రయించగా ఇటీవల సదరు వ్యక్తి ఆ స్థలంలో గృహ నిర్మాణం చేపట్టాడు. గృహ నిర్మాణం జరిగిన తర్వాత తన గృహ ప్రవేశ సమయంలో ఇంటిని ఆనుకోని ఉన్న బందెల దొడ్డిని గత నాలుగు నెలల క్రితం మట్టితో కప్పి ఇంటి పహారి గోడతో కలుపుకునే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన కొందరూ గ్రామస్తులు ఆక్షేపించి అడ్డు చెప్పారు. అయితే గ్రామ సమీపంలో వేరే స్థలాన్ని కొనుగోలు చేసి అక్కడ బందెల దొడ్డి నిర్మాణం చేసి గ్రామానికి ఇస్తానని భీష్మించాడు. దీనికి గ్రామస్తులు ససేమిరా అనడంతో నేటికి బందెల దొడ్డికి విముక్తి కలుగ లేదు.

# కల్వల ప్రధానోపాధ్యాయుడి దాతృత్వం



**వరంగల్ వాయిస్, కేసముద్రం :** మండలంలోని కల్వల ప్రభుత ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు రూ.40 వేల విలువగల సామాగ్రి పంపణి వేశారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కళ్లెం వీరారెడ్డి తన సొంత నిధులతో 80మంది విద్యార్థులకు టీషర్టులు, ఐడీ కార్డులు, టై, బెల్టులు సమకూర్చి తన దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బండారు నరేందర్ మాట్లాడుతూ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్న హెచ్ఎం వీరారెడ్డి, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం.మౌనిక, ఉపాధ్యాయులు గనె యాదగిరి, డి.గోపి, వి.సుమలత, సీహెచ్.స్వరూప, బి.హరిక్రిష్ణ, జి.కృష్ణ, ఎం.శ్రీదేవి, జి.మోహనక్రిష్ణ, తల్లిదండ్రులు చంద్రశేఖర్, యాకన్న, రవి, స్రవంతి, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

# భారతీయుడు-2 నెగెటివ్ టాక్

## ప్రారంభ వసూళ్లు వీక్

దాదాపు 28 సంవత్సరాల క్రితం శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారతీయుడు సినిమా ఎంతటి ఘన విజయం సాధించందో తెలిసిన విషయమే. దానికి సీక్వెల్ భారతీయుడు 2.ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. అయితే ఫస్ట్ షో నుంచే ఈ సినిమాకు నెగిటివ్ టాక్ రావడం మొదటి భాగమైన భారతీయుడికి ధీటుగా లేకపోవడం వలన మూవీపై చాలా దెబ్బ పడింది. ఇక ఎన్నో అంచనాలతో చిత్రాన్ని వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులకు అడుగడుగునా అసంతృప్తికి గురిచేసిందని సినిమా రివ్యూలు చెబుతున్నాయి. దీనికి తోడు టిక్కెట్ల రేట్లు పెంచడం ఈ చిత్రానికి మైనస్ అనే చెప్పుకోవాలి.

తెలంగాణలో టిక్కెట్ల రేట్లు పెంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వంను అనుమతి కోరగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే మల్టిప్లె క్సలలో 75 నుంచి 150 వరకు టిక్కెట్ల రేటు పెంచడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ చిత్రానికి ఉన్న వీక్ టాక్ తో ప్రారంభ వసూళ్లు కూడా లేకపోవడం గమనార్హం .

ఇటీవల విడుదలై బ్లాక్ బస్టర్ గా నిలిచిన కల్కి 2898 ఏడీ సినిమాకు కూడా టిక్కెట్ల రేట్ల పెంపుదల కాస్త మైనస్ గానే మారిందని అందరి అభిప్రాయం. భారతీయుడు-2 కూడా టిక్కెట్ల రేట్లు పెంచడం, సినిమా ప్రేక్షకులను నిరాశపరిచిన విధానం వీటి ప్రభావం కలెక్షన్స్ పై పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.


ఈ పరిస్థితిలో భారతీయుడు -2 కలెక్షన్స్ కష్టమే అంటున్నారు.



# వైవిధ్యంగా తంగలాన్ మూవీ..

కథానాయకుడు చియాన్ విక్రమ్ ఎంపిక చేసుకునే పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. ప్రస్తుతం తంగలాన్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కాలా, కబాలి వంటి సినిమాలు రూపొందించిన దర్శకుడు పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం తంగలాన్. ఈ చిత్రాన్ని పా.రంజిత్ తనదైన శైలిలో అందరూ అబ్బుర పడేలా చిత్రీకరించారని యూనిట్ వర్గాలు చెప్పారు. ఇక విడుదలైన ఈ థియేట్రికల్ ట్రైలర్ చూస్తుంటే తప్పకుండా ఈ చిత్రాన్ని థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమాలా అనిపిస్తుందని అంటున్నారు విక్రమ్ అభిమానులు. తంగలాన్ బంగారు నిధుల నేపథ్యంలో యథార్థ సంఘటనలతో తీసిన చిత్రంలా కనిసిస్తుంది. విజువల్స్ ఆకట్టుకునే విధంగా వున్నాయి. మేకింగ్‌లో రిచ్‌నెస్, ప్రొడక్షన్ క్వాలిటీస్ కనిపిస్తున్నాయి. విక్రమ్ ఈ చిత్రంలో అటవి జాతికి చెందిన వీరుడిలాగా? ఇప్పటి వరకు కెరీర్‌లో పోషించనటువంటి వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఈ పాత్ర కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, కొన్నివారాల పాటు విక్రమ్ ఉపవాసాలు వున్నాడని తెలిసింది. ఈ పాత్ర కోసం విక్రమ్ చాలా హార్డ్ వర్క్ చేశారని తెలుస్తుంది. ఆయన చాలా బరువు తగ్గారు. ఇక ఈ ట్రైలర్ లో ఆ అటవీ ప్రాంతంలో బంగారు నిధులు ఉన్నాయని బ్రిటీషర్లు గుర్తించి అక్కడి గిరిజన తెగ ప్రజలను సహాయం కోరుతారు. ఈ క్రమంలో నిధుల తవ్వకం మొదలు పెడుతారు. అప్పుడు అక్కడి ప్రజలు ఎదురుకునే ప్రమాదాల నుండి ప్రాణాలకు తెగించి కాపాడే పాత్రలో విక్రమ్ కనిపించనున్నాడు. తమ జాతి ప్రజలను కాపాడుకునే వీరుడిగా విక్రమ్ నటన మరో లెవల్‌లో వుంటుందని అంటున్నాయి చిత్ర వర్గాలు.. మాళవిక మోహనన్,పార్వతీలు డీ గ్లామర్ రోల్ లో నటిస్తున్నారు. తంగలాన్ ఆగష్టు 15 న విడుదల కానున్నట్లు సమాచారం.







## నాలుగేళ్ల నాటి డ్యాన్స్ కట్‌పై ట్రోల్సా ?

హైదరాబాద్: తన డ్యాన్స్‌ను ట్రోల్ చేస్తూ సోషల్‌మీడియా వేదికగా ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌పై నటి అనసూయ  స్పందించారు. పారదర్శక, గౌరవప్రదమైన విమర్శలను తాను ఆహ్వానిస్తానని చెప్పారు. 'నా మానసిక ప్రశాంతతను దృష్టిలో ఉంచుకొని కొన్ని విషయాలపై స్పందించకూడదని నిర్ణయించుకున్నా. మహానటి సావిత్రమ్మకు నివాళిగా దాదాపు నాలుగేళ్లక్రితం ఓ ఈవెంట్‌లో నేనిచ్చిన ప్రదర్శనలోని కొన్ని డ్యాన్స్ మూమెంట్స్‌ను ట్రోల్ చేయడం.. వాటికి ఇలా అవమానకర రీతిలో విమర్శలు చేయడం బాధాకరం. ఇక్కడ నా గురించి చెప్పట్లేదు.. నివాళులకు సంబంధించిన విషయాల్లో ఇలా చేయడం ఆ గొప్ప వ్యక్తులను అవమానపర్చినట్లే..! మర్యాదపూర్వకమైన విమర్శలను నేను ఎప్పుడూ స్వాగతిస్తా. ఆ కార్యక్రమంలో నా మొత్తం ప్రదర్శన చూసిన తర్వాత మీరు ఒక నిర్ణయానికి రండి' అని ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. అనసూయ ప్రస్తుతం వరుస సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. 'పుష్ప 2'తోపాటు 'ఫ్లాష్‌బ్యాక్', 'వోల్ఫ్' వంటి తమిళ చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## కన్నడ నటుడు, నిర్మాత రక్షిత్‌శెట్టి పై కేసు



కన్నడ నటుడు, నిర్మాత రక్షిత్‌శెట్టి పై కేసు నమోదైంది.  తమ సంస్థకు చెందిన పాటలు కాపీ కొట్టారని పేర్కొంటూ ఎంఆర్‌టీ మ్యూజిక్ కంపెనీ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దిగంత్, అచ్యుత్‌కుమార్, యోగేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్యాచిలర్ పార్టీ'. పరంవా స్టూడియోస్ పతాకంపై రక్షిత్ శెట్టి నిర్మించారు.  ప్రస్తుతం ఇది అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులో ఉంది.



## ఉత్సాహంగా..
## శ్రీదీప్ ఆర్యన్ జన్మదినోత్సవం

హనుమకొండ నగరం కుమార్ పల్లికి చెందిన మామిడి ఉషశ్రీ-ప్రదీప్ ల కుమారుడు మామిడి శ్రీదీప్ ఆర్యన్ రెండో జన్మదిన వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. గడ్డం సంధ్యారాణి-కేశవమూర్తి, గడ్డం సాహిత్, మామిడి అరుణ-సుదర్శన్ తో పాటు బంధుమిత్రులు శ్రీదీప్ ఆర్యన్ కు శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వాయిస్ నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, వివిధ పత్రికల ప్రతినిధులు బూర్ల నరేందర్, పిట్ట శ్రీకాంత్, సోమనర్సయ్య, పూర్ణచందర్, రఘు, ఎమ్మెస్ తదితరులు శ్రీదీప్ ఆర్యన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. – వరంగల్ వాయిస్, హనుమకొండ




# అర్హులకే రైతు భరోసా

**వ్యవసాయాన్ని ఆదుకునేలా చర్యలు**
**సన్న, చిన్నకారు రైతులకే చేయూత**
**హామీ అమలుకే ప్రజాభిప్రాయ సేకరణ**
**ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అర్హులందరికీ రైతు భరోసా వర్తింపచేసేందుకు కావాల్సిన విధి విధానాలు రూపొందించేందుకే రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి రైతులు, రైతు సంఘాల ప్రతినిధులనుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రకటించారు. వ్యవసాయాన్ని ఆదుకునేలా రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రైతు భరోసా పథక విధివిధానాలపై ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్కతోపాటు సభ్యులైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రు నాయక్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రైతులు, రైతు ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతు భరోసా పథకాన్ని అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలను నిర్వహించి రైతుల అభిప్రాయాల మేరకు శాసనసభ సమావేశాల్లో చర్చించిన అంశాలను తీర్మాణం చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళను అందించనున్నట్లు పేర్కొన్నారు. సాగు కోసం రైతులకు ఒక దఫా పంట సాయాన్ని చెల్లించామని తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరి అభిప్రాయాల మేరకు ప్రజా ప్రభుత్వం రైతు భరోసా పై నిర్ణయం తీసుకుంటుందన్నారు.

ఆరు నెలల క్రితం తమ ప్రభుత్వం ఏర్పడిందని, తెలంగాణలో అత్యంత ప్రాధాన్యం కలిగిన వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయాలని సోనియా గాంధీ, రాహుల్ గాంధీల సూచనల మేరకు ఆరు నెలల క్రితం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు ఆగస్టులో రెండు లక్షల రుణమాఫీ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం విధివిధానాల రూపకల్పన





జరుగుతుందన్నారు. రైతుల ఖాతాల్లో రూ.7,562 కోట్లను ప్రభుత్వం జమ చేసిందన్నారు. రైతుబంధులో జరిగిన అనేక అవకతవకలు రైతు భరోసా విషయంలో జరగకూడదనే ఉద్దేశంతోనే రైతుల అభిప్రాయాలను తీసుకొనేందుకు సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాన్య రైతులు, చిన్న, సన్న కారు రైతులకు ఏ విధంగా మేలు జరుగుతుందనే సమావేశాల్లో అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగితే ఎలాంటి పరిహారం రాకపోయేదని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంట నష్టపోతే బీమా ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, డాక్టర్ మురళి నాయక్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, రిజ్వాన్ భాషా షేక్, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, దివాకర, ఉమ్మడి జిల్లా రైతులు రైతు సంఘాల ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 17న బీరన్న బోనాలు

## చెట్లోల్లగడ్డవద్ద ఒగ్గు కళాకారుల విన్యాసాలు

### హాజరు కానున్న ప్రముఖులు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కురుమ కులస్థుల ఇలవేలుపు బీరన్న బోనాల పండుగను ఈనెల 17న తొలి ఏకాదశి పర్వదినం రోజున నిర్వహించుకోనున్నట్లు ఉర్సు శ్రీ బీరన్న స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మరుపల్ల రవి తెలిపారు. రక్తం చుక్క పడకుండా చూపరులను ఆకట్టుకునేలా ఒగ్గు కళాకారులు చేసే విన్యాసాలు ప్రత్యేక ఆకర్షనగా నిలుస్తాయని వివరించారు. ఉర్సు కురుమ కులస్థులందరూ బోనంతో చెట్ల వారి వీధికి చేరుకుంటారని వివరించారు. అక్కడే గంట, గంటన్నరపాటు విన్యాసాలు ఉంటాయని, వీటిలో కురుమ కులస్థులే కాకుండా ఇతర కులస్థులు కూడా ఈకార్యక్యక్రమంలో పాల్గొంటారన్నారు. అక్కడినుంచి దేవాలయం చేరుకొని స్వామి వారికి బోనాన్ని సమర్పిస్తారని తెలిపారు. బోనాల జాతర విజయవంతానికి మహానగరపాలక సంస్థతోపాటు పోలీసులు, ఎలక్ట్రిసిటీ అధికారులు తమవంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు వెల్లడించారు. బీరన్న అభిషేకం తర్వాత కురుమ కులస్థులతోపాటు ఇతర కులాలకు చెందిన వారుకూడా స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. అయితే ఈ బోనాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రజాకార్ల సమయంనుంచే ఉర్సు బోనాల జాతర జరుగుతోందని వెల్లడించారు. స్వామివారి బండారి, కంకణాలకోసం భక్తులు ఎగబడతారన్నారు. వాటిని ప్రతి భక్తునికి అందజేశేలా సమష్టిగా కృషి చేస్తామన్నారు. ఈ ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మేడర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఇతర పార్టీ ప్రముఖులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు తదితరులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బీర కోటేశ్వర్, నీల యాకయ్య, అన్న కుమారస్వామి, మండల ప్రమీల, కోరె అయిలయ్య, మిర్యాల కుమారస్వామి, గౌడ కోటేశ్వర్, కొల్పుల కోటేశ్వర్, పూజారి బలభద్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సెలవు ప్రకటించాలి..

హిందువుల తొలి పండుగ తొలి ఏకాదశి పర్వదినం రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఉర్సు శ్రీ బీరన్న స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మరుపల్ల రవి డిమాండ్ చేశారు. కురుమ కులస్థులు అదే రోజు బీరన్న బోనాల పండుగను నిర్వహిస్తారని గుర్తు చేశారు. తొలి పండుగగా గుర్తింపు పొందిన ఏకాదశి రోజున ప్రభుత్వం సెలవు ప్రకటిస్తే పండుగను మరింత ఘనంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు.

# తహాశీల్దార్ల బదిలీలను వెంటనే చేపట్టాలి

## మంత్రిని కోరిన ట్రెసా జిల్లా నేతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన తహాశీల్దార్లు, నాయబ్ తహాశీల్దార్లను తిరిగి పూర్వపు స్థానాలకు బదిలీ చేసి గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టపరచాలని ట్రెసా ప్రతినిధులు కోరారు. రైతు బంధు సదస్సులో పాల్గొనేందుకు సోమవారం హనుమకొండకు విచ్చేసిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ట్రెసా జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రియాజుద్దీన్ నేతృత్వంలో పలువురు ప్రతినిధులు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఇప్పటికే పలు అంశాలపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కేంద్ర సంఘం తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలన్నిటినీ త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా తహాశీల్దార్లు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com